క్లుప్తంగా

నూతన వధూవరులకు ఆశీర్వాదం



మదనపల్లె రూరల్ : వైఎస్సార్ సీపీ నాయకులకు చెందిన పలు శుభ కార్యక్రమాల్లో నియోజకవర్గ సమన్వయకర్త నిసార్‌అహ్మద్ పాల్గొన్నారు. శనివారం మధ్యాహ్నం శ్రీదేవి గార్డెన్స్‌లో జరిగిన మాజీ ఎమ్మెల్యే డాక్టర్.దేశాయ్ తిప్పారెడ్డి మనవడి నామకరణ మహోత్సవానికి, పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి హాజరయ్యారు. చిన్నారిని ఆశీర్వదించి, డాక్టర్. దేశాయ్‌తిప్పారెడ్డి కుటుంబసభ్యులకు శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఆర్.ఆర్. ఫంక్షన్‌హాల్‌లో...వైఎస్సార్ సీపీ యువజన విభాగం రాష్ట్ర కార్యదర్శి ఇర్ఫాన్ వివాహ వేడుకలో పాల్గొని వధూవరులను ఆశీర్వదించారు. వివాహ శుభాకాంక్షలు తెలిపారు. పీలేరు నియోజకవర్గం కలకడకు చెందిన మొగల్ మహబూబ్ అలీబేగ్ కుమార్తె ఆయేషాబేగం వివాహానికి హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించి శుభాకాంక్షలు తెలిపారు.

డీఆర్‌ఓ బదిలీ

మదనపల్లె: అటవీశాఖ మదనపల్లె డిప్యూటీ రేంజి అధికారి మదన్‌మోహన్ బదిలీ అయ్యారు. ఇక్కడి నుంచి తిరుపతి జిల్లా శ్రీకాళహస్తీ రేంజికి బదిలీ చేశారు. ఇక్కడ ఎవరిని నియమించలేదు.

నల్లవీరగంగా భవాని జాతర



ప్రత్యేక అలంకరణలో అమ్మవారు

కలికిరి(వాల్మీకిపురం): మండలంలోని జర్రావారిపల్లి గ్రామంలో వెలసిన శ్రీనల్లవీరగంగా భవాని అమ్మవారి జాతర గ్రామస్తులు ఆదివారం వైభవంగా నిర్వహించారు. మహిళలు అమ్మవారికి దీలు బోనాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. ఈ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు, విశేష అలంకరణ చేశారు.

నియామకం

మదనపల్లె రూరల్ : రాయచోటి టీడీపీ పరిశీలకుడిగా మదనపల్లెకు చెందిన టీడీపీ సీనియర్ నాయకులు, రాష్ట్ర హజ్‌కమిటీ సభ్యులు పఠాన్ ఖాదర్‌ఖాన్ నియమితులయ్యారు. ఆదివారం స్థానికంగా ఏర్పాటుచే సిన మీడియా సమావేశంలో పఠాన్ ఖాదర్‌ఖాన్ మాట్లాడుతూ...గ్రామస్థాయి నుంచి తెలుగుదేశం పార్టీని బలోపేతం చేయడమే లక్ష్యంగా పనిచేస్తానన్నారు.

చైతన్య శరవణ్ మృతి

బి.కొత్తకోట: బి.కొత్తకోట మండలంలో 1998 నుంచి ప్రజలకు సేవలు అందించిన చైతన్య స్వచ్ఛంధ సంస్థ కార్యదర్శి శరవణ్‌కుమార్ ఆదివారం మృతి చెందారు. కొంతకాలంగా ఆరోగ్య సమస్యలతో బాధపడుతున్న ఆయన బెంగళూరు ఆస్పత్రిలో చికిత్సపొందుతూ మృతి చెందారు. సంస్థ ద్వారా మండలంలోని బడికాయలపల్లె గ్రామంలో తన సేవా కార్యక్రమాలను మొదలుపెట్టి వాటర్‌షెడ్, ప్రభుత్వ కార్యక్రమాలు, పథకాల ద్వారా గ్రామాలకు అవసరమైన పనులను చేపట్టారు. బి.కొత్తకోట కేంద్రంగా కార్యకలాపాలను నిర్వహించేవారు. ఆయన మృతికి ప్రముఖులు, ప్రజాప్రతినిధులు, పార్టీల నాయకులు సంతాపం తెలిపారు.

తిరుపతిరావుకు సన్మానం



తిరుపతిరావును సన్మానిస్తున్న ఫ్రెండ్స్ క్లబ్ సభ్యులు

మదనపల్లె సిటీ: ప్రజాచైతన్య స్రవంతి అధ్యక్షుడు గొల్లపూడి తిరుపతిరావు తెలుగుబుక్ ఆఫ్ రికార్డ్స్ ఐకాన్– 25 అవార్డు పొందిన సందర్భంగా ఆదివారం స్థానిక రెడ్డీస్‌కాలనీలోని ఫ్రెండ్స్ క్లబ్‌లో సభ్యులు సన్మానం చేశారు. ప్రముఖ రచయిత డాక్టర్ జె.భాగ్యలక్ష్మి మాట్లాడుతూ కాలమాన పరిస్థితుల్లో వచ్చిన మార్పులకు అనుగుణంగా మనిషి నడక తప్పదని ఆ నడకలో ఎదురయ్యే సమస్యలను స్పోర్టివ్‌గా తీసుకోవాలన్నారు. తిరుపతిరావు అందిస్తున్న సామాజిక సేవలను కొనియాడారు. ప్రస్తుత సామాజిక పరిస్థితుల్లో మనుషుల అవసరాలు, వివిధ రకాలగా వృథా అవుతున్న కాలం గురించి ప్రముఖ నవలా రచయిత టీ.ఎస్.ఎ.క్రిష్ణమూర్తి తెలియజేశారు. కార్యక్రమంలో ఫ్రెండ్స్ క్లబ్ సభ్యులు భవానీ ప్రసాద్, మల్లిక, నందకి షోర్, రమేష్,గీత, కృష్ణతులసి, శ్రీనివాసులునాయుడు,హిమకర్ పాల్గొన్నారు.

మదనపల్లెలో విధులు కత్తిమీద సామే!

- 22ఏ భూములను విముక్తి చేయాలంటూ పై స్థాయి ఒత్తిళ్లు
- అధికార టీడీపీలో ఎమ్మెల్యే, మాజీ ఎమ్మెల్యేలు,
- నేతల వర్గపోరుతో ప్రతిపనికి ఇబ్బందులు
- తహసీల్దార్లకు సిబ్బంది సహాయ నిరాకరణ
- ఏం చేస్తే ఏం జరుగుతుందోనన్న భయంతో తహసీల్దార్లు



మదనపల్లె తహసీల్దార్ కార్యాలయం

మదనపల్లె: మదనపల్లె రెవెన్యూలో తహసీల్దార్లుగా విధుల నిర్వహణ కత్తిమీద సాము లేదా పులి మీద స్వారీగా చెప్పవచ్చు. దీనితో ఇక్కడ తహసీల్దార్లుగా పని చేయడం ఆషామాషీ వ్యవహారం కాదు. నిఖచ్చిగా పనిచేసేవారైనా సరే ఇక్కడి ఒత్తిళ్లు, పరిస్థితులకు తలొంచాల్సిందే. లేదంటే బదిలీ చేయించుకుని వెళ్లాల్సిందే. కూటమి ప్రభుత్వం వచ్చాక 2024 అగస్టు నుంచి 2015 ఫిబ్రవరి వరకు ఖాజాబీ పని చేయగా ఫిబ్రవరిలో ఇక్కడికి బదిలీ అయిన కే.ధనంజయలు తాజాగా బదిలీ అయ్యారు. ఇక్కడ పనిచేసేందుకు ఉద్యోగ విరమణ చివరి దశలో ఉన్న వాళ్లు, అధికారపార్టీ అండదండలు ఉన్న వాళ్లకైతే నిబంధనలు, రెవెన్యూ రూల్స్‌తో పని లేకుండా పని కానిచ్చేస్తారు. రెవెన్యూ విధుల నిర్వహణలో కాస్త మంచి పేరు, ఉన్నతాధికారుల దృష్టిలో సమర్థులుగా పేరున్న వాళ్లు మదనపల్లెలో పని చేయాలంటే కష్టమే. వీరు భవిష్యత్తును పణంగా పెట్టి విధులు నిర్వహించలేక బదిలీలతో వెళ్లిపోతున్నారు. మదనపల్లె మండల రెవెన్యూ వ్యవస్థలో నెలకొన్న పరిస్థితులు ఇలా ఉన్నాయి.

22ఏపై పైస్థాయి ఒత్తిళ్లు

మదనపల్లె పట్టణం, పరిసర ప్రాంతాల్లోని భూములు ఎకరం బహిరంగ మార్కెట్‌లో కోట్లలో పలుకుతుంది. ఇందులో 22ఏలో ఉన్న భూములున్నాయి. వీటిని 22ఏ నుంచి తొలగించేందుకు తహసీల్దార్లపై మంత్రులు, సీఎం పేషీ స్థాయి నుంచి ఒత్తిళ్లు వస్తాయి. ఈ ఒత్తిళ్లతో అర్హతలేని 22ఏ భూములను నిషేధం నుంచి తొలగించేందుకు సాధ్యపడదు. అయినప్పటికి ఒత్తిళ్లు ఆగవు. ఒక దశలో తమ భూములను 22ఏ నుంచి తొలగిస్తే కోట్లు ఇస్తామని ఆశ చూపే పరిస్థితులు ఉన్నాయి. దీనితో తహసీల్దార్లు ఒత్తిడికి గురవ్వాల్సి వస్తుంది. ఈ భూముల వ్యవహారంలో ఇప్పటికే మదనపల్లె సబ్‌రిజిస్ట్రేషన్ అధికారులు నిబంధనలను ఉల్లంఘించి రిజిస్ట్రేషన్లు చేశారన్న ఆరోపణలు ఎన్నో ఉన్నాయి. ఈ పరిస్థితుల్లో తహసీల్దార్లు ఎలా వ్యవహరించాలో తెలియక ఇబ్బందిపడాలి. దీనితో ఇక్కడ పనిచేసేందుకు తహసీల్దార్లు పెద్దగా ఆసక్తి చూపడం లేదు.

టీడీపీ వర్గపోరు తలనొప్పి

టీడీపీలో నెలకొన్న వర్గపోరు తహసీల్దార్లకు తలనొప్పిగా మారుతోంది. మదనపల్లెలో ఎమ్మెల్యే వర్గంతోపాటు మాజీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్యేను వ్యతిరేకించే వర్గాలు ఉన్నాయి. తహసీల్దార్లు ఏ పని చేసినా ఫలానా పని ఎందుకు చేశారంటూ పరోక్ష వేధింపులు అధికం. దీనితో ఏ పని చేయాలో ఏది చేయకూడదో అర్థంకాక తలపట్టుకుంటున్నారు. ఈ మధ్య ఓ నాయకుడు అధికారులపై చిందులేసిన ఘటన, రెవెన్యూ ఉద్యోగులపై దాడులు చోటు చేసుకున్నాయి. ఓ నాయకుడి తిట్ల పురాణం అధికారులు వినాల్సి వచ్చింది. ఈ వర్గపోరు తహసీల్దార్ల కంటికి కునుకు లేకుండా చేస్తోంది.

మదనపల్లెపై దృష్టి

జిల్లాలోని అన్ని ప్రాంతాలు ఒక ఎత్తయితే మదనపల్లె ఒకఎత్తు. కలెక్టర్ నుంచి సబ్‌కలెక్టర్, వీరి మధ్యలో ఉండే జిల్లా అధికారుల దృష్టంతా మదనపల్లెనే ఉంటోంది. ఒకరకంగా చెప్పాలంటే నిరంతర నిఘా ఉంటోంది. తహసీల్దార్లపై ఆరోపణలు, విధుల నిర్వహణ తీరు, పనితీరులో ఆరోపణలు తదితర అంశాలపై నిత్యం పర్యవేక్షణ ఉంటోంది. దీనితో ఏ తప్పు జరిగినా బాధ్యత వహించాల్సి వస్తుంది. మదనపల్లెలో భూముల వ్యవహారంలో కోట్లకంటే అధికంగా ఉంటుండటం వల్ల ఇక్కడి రెవెన్యూ విధులపై ప్రత్యేక దృష్టి పెట్టారు. ఎందుకంటే వివాదాస్పద నిర్ణయాలు, ఆరోపణలపై కలెక్టర్ స్వయంగా రికార్డులను పరిశీలిస్తుంటారు. దీనితో తప్పు చేసి తప్పించుకోవడం కష్టం.

ట్యాంపరింగ్ కీలకం :

తహసీల్దార్ కార్యాలయంలో భూ రికార్డుల తారుమారుపై ఎన్నో ఆరోపణలు ఉన్నాయి. కొందరు రెవెన్యూ సిబ్బందితో సఖ్యతగా ఉండే ఒకరిద్దరు దళారులు తామే చెప్పిందే చేయించుకుంటున్నరన్న గట్టి ఆరోపణలు ఉన్నాయి. బోగస్ పట్టాల సృష్టి నుంచి వాటిని రెవెన్యూ రికార్డుల్లో నమోదు చేసే వరకు కొందరు సహకరిస్తున్నట్టు ఆరోపణలు ఉన్నాయి. ఈ వ్యవహారం తహసీల్దార్లకు చాలా క్లిష్టమైన సమస్యగా మారింది. వివాదం ఉన్నప్పుడు అసలు రికార్డుల స్థానంలో ట్యాంపరింగ్ రికార్డులతో తల పట్టుకోవాల్సి వస్తోంది. ఇది నిజమని నమ్మితే నిజమైన భూ యజమానులకు తీరని అన్యాయం చేసినట్టే. దళారులను కట్టడి చేసే ముందు రెవెన్యూ సిబ్బంది సహకారం లేకుండా కట్టడి చేసేందుకు కలెక్టర్ స్పష్టమైన చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉందని రెవెన్యూ వర్గాలే కోరుతున్నాయి.

సహాయ నిరాకరణ

కిందిస్థాయి రెవెన్యూ సిబ్బందిలో కొందరి నుంచి తమకు అన్ని విషయాల్లో పూర్తి సహకారం అందడం లేదన్న ఆవేదన తహసీల్దార్లలో వ్యక్తమవుతోంది. కీలకమైన, వివాదాస్పద భూ సంబంధిత అంశాల్లో సహకారం లేకపోవడాన్ని ఒకరిద్దరు తహసీల్దార్లు ఆవేదన వ్యక్తం చేశారు. దీనివల్ల వాస్తవాలు తెలియక నిర్ణయాలు తీసుకోలేని పరిస్థితి వస్తోందని అంటున్నారు. దీనిద్వారా దళారులకు ప్రయోజనం కలుగుతుంది. ఈ అంశాన్ని కలెక్టర్, ఉన్నతాధికారులు కీలకంగా భావించి చర్యలు తీసుకోవాల్సిన అత్యవసర పరిస్థితి ఉంది.

సిబ్బంది కొరత

తహసీల్దార్ కార్యాలయ పరిధిలో 68 మంది వీఆర్ఓలు ఉండాల్సి ఉండగా 17 మంది రెవెన్యూ వీఆర్ఓ, సచివాలయ వీఆర్‌ఓలతో కలిపి 51 మంది ఉన్నారు. విధుల నిర్వహణ కు కావాల్సిన సిబ్బంది లేరు. దీనితో సమస్యల పరిష్కారం, వివాదాలపై దృష్టి పెట్టడానికి సమయం సరిపోవడం లేదు. అలాగే మదనపల్లెలో ఆక్రమణలు, వాటిలోకి అక్రమ ప్రవేశాలు, వందల్లో ఉన్న న్యాయస్థానాల కేసుతో తహసీల్దార్లు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. అత్యధిక సంఖ్యలో వస్తున్న ధృవీకరణ పత్రాల పరిష్కారం కూడా సకాలంలో జరగడం లేదు. ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

వృద్ధుల సమస్యలు పరిష్కరిస్తాం

–ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి బి.సుభాష్



మాట్లాడుతున్న ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి బి.సుభాష్

మదనపల్లె సిటీ: వృద్ధులకు ఎలాంటి సమస్యలు వచ్చినా తక్షణమే తెలియజేయాలని ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి బి.సుభాష్ అన్నారు. ఆదివారం స్థానిక అమ్మచెరువుమిట్టవద్దనున్న వెలుగు ప్రత్యేక పాఠశాల, వృద్ధాశ్రమంలో వయోవృద్ధుల సమస్యలపై సదస్సు ఏర్పాటు చేశారు. జడ్జి మాట్లాడుతూ మానసికంగా, శారీరకంగా ఇబ్బంది పడిన వెంటనే తెలియజేయాలన్నారు. ఎటువంటి న్యాయ సమస్యలకైనా న్యాయస్థానం ముందు తెలియజేయాలన్నారు. వృద్ధాశ్రమంలో ఆశ్రయం పొందుతున్న వారు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వెలుగు ప్రత్యేక పాఠశాలలో ఆశ్రయం పొందుతున్న మానసిక రుగ్మతతో బాధపడుతున్న రేఖ అనే విద్యార్థిని సమస్యను విని వాటి పరిష్కారాన్ని తెలియజేశారు. ఇలా న్యాయం అవసరమైన వారికి సలహాలు, సూచనలను ఇచ్చారు. సీనియర్ సిటిజెన్స్ అసోసియేషన్ అధ్యక్షులు మునిగోపాలకృష్ణ మాట్లాడుతూ వృద్ధులు కోసం కేంద్ర ప్రభుత్వం ఆయుష్మాన్ భారత్ కార్యక్రమం అమలు చేస్తుందన్నారు. వీటి సేవలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో బీటీ కాలేజీ కరస్పాండెంట్ వై.ఎస్. మునిరత్నం, వెలుగు కార్యదర్శి ఉదయమోహన్ రెడ్డి, కన్వీనర్ భాగ్యలక్ష్మి, ధనలక్ష్మి, దాదాపీర్ తదితరులు పాల్గొన్నారు.

పని గంటలపై 20న నిరసన



మాట్లాడుతున్న సాంబశివ

బి.కొత్తకోట: కార్మికుల పనిగంటలను పెంచుతూ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం వెనక్కు తీసుకోవాలన్న డిమాండ్‌తో ఈనెల 20న నిర్వహిస్తున్న నిరసన కార్యక్రమాలను విజయవంతం ఏఐటీయూసీ నాయకులు కోరారు. ఆదివారం బి.కొత్తకోటలో అనుబంధ సంఘాల సమావేశంలో ఏఐటీయూసీ ప్రధాన కార్యదర్శి సాంబశివ, ఉప ప్రధాన కార్యదర్శి సలీంబాషా మాట్లాడుతూ ఎనిమిది గంటలున్న కార్మికుల పనిదినాలను పెంచడం దారుణమన్నారు. కార్మిక సంక్షేమాన్ని, హామీల అమలును విస్మరించిన ప్రభుత్వం కార్మిక వ్యతిరేక విధానాలను అమలు చేస్తోందన్నారు. నియోజకవర్గ, మండల కేంద్రాల్లో జరిగే నిరసన కార్యక్రమాల్లో పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో ముబారక్, వేణుగోపాల్‌రెడ్డి, బాలకృష్ణ, గఫూర్, షౌకత్, శ్రీనివాసులు, కుమార్, రియాజ్ పాల్గొన్నారు.

జాతీయ స్థాయిలో టాప్–20 కళాశాలగా మిట్స్



కురబలకోట: జాతీయ స్థాయిలో టాప్–ట్వంటీ ఇంజినీరింగ్ కళాశాలగా అంగళ్లులోని మిట్స్‌కు ట్రిపుల్ ఏ రేటింగ్ లభించినట్లు ప్రిన్సిపాల్ యువరాజ్ ఆదివారం తెలిపారు. ఎన్‌పిటీఈఎల్ నిర్వహించిన ఆన్‌లైన్ పరీక్షలలో కళాశాల విద్యార్థులు, అధ్యాపకులు 5747 మంది అద్భుత ప్రతిభ కనపరచినట్లు తెలిపారు. 200 మందికి గోల్డ్ రేటింగ్, 1191 మందికి సిల్వర్, 2419 మందికి ఎలైట్ రేటింగ్ లభించదని తెలిపారు. కళాశాలకు ట్రిపుల్ ఏ రేటింగ్‌తో పాటు జాతీయ స్థాయిలో టాప్ ట్వంటీలో 13వ ర్యాంక్‌గా ఎన్‌పీటీఈఎల్ గుర్తింపు లభించిందని తెలిపారు. ఈ గుర్తింపుకు కారణమైన విద్యార్థులు, అధ్యాపకులు, మేనేజ్‌మెంట్ సభ్యుల కృషిని కళాశాల కరస్పాండెంట్ డాక్టర్ ఎన్. విజయభాస్కర్ చౌదరి, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కీర్తి నాదేళ్ల అభినందించారు.

శేషయ్య సేవలు అభినందనీయం



శేషయ్యను సన్మానిస్తున్న సబ్ కలెక్టరేట్ డీఏఓ నిర్మలాదేవి

మదనపల్లె రూరల్ : రాజంపేట సబ్ కలెక్టరేట్ డీఏఓగా పదవీవిరమణ పొందిన చెన్నంచెట్టి రామాది శేషయ్య అనుభవం, సేవలు, భవిష్యత్ తరాలకు స్ఫూర్తివంతంగా నిలుస్తాయని పలువురు కొనియాడారు. డీఏఓ శేషయ్య పదవీవిరమణ సందర్భంగా ఆదివారం స్థానిక ఓ ప్రైవేట్ ఫంక్షన్ హాల్‌లో ఆత్మీయ సమ్మేళనం ఏర్పాటు చేశారు. కార్యక్రమానికి మదనపల్లె రెవెన్యూ డివిజన్ పరిధిలోని డీఏఓ, తహసీల్దార్లు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు. 38 సంవత్సరాలుగా రెవెన్యూ డిపార్ట్‌మెంట్‌లో వివిధ హోదాల్లో బాధ్యతలు నిర్వహించి డీఏఓ హోదాలో పదవీవిరమణ పొందిన శేషయ్య సేవలు అభినందనీయమన్నారు. ప్రతి ఉద్యోగి జీవితంలో పదవీ విరమణ తప్పదని, అయితే...విధి నిర్వహణలో నిబద్ధత, నిజాయితీతో చేసిన సేవలు కలకాలం గుర్తుండిపోతాయన్నారు. సమావేశంలో భాగంగా శేషయ్య దంపతులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో డీఏఓ నిర్మలాదేవి, తహసీల్దార్ ధనంజయులు, జిల్లా రెవెన్యూ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి బాబ్జీ, డిప్యూటీ తహసీల్దార్లు అస్లాం, నవీన్, విజయ్‌కుమార్‌రెడ్డి, వీఆర్వోలు హేమాంబర్‌రెడ్డి, ప్రదీప్, సుమన్ టీవీ సిరివేలు చరణ్ తదితరులు పాల్గొన్నారు.

అడిగేదెవరు..ఆపేదెవరు



ఓంటిళ్లు దగ్గర హైవే స్థలాన్ని చదును చేస్తున్న ఆక్రమణదారు

- రూ.కోటి స్థలానికి స్కెచ్
- దర్జాగా హైవే స్థలం ఆక్రమణ

కురబలకోట: మండలంలోని ముదివేడు దగ్గర రాయచోటి మార్గంలోని ఓంటిళ్ల సమీపంలో హైవే రోడ్డుకు చెందిన స్థలాన్ని అధికార పార్టీకి చెందిన ఒకరు ఆక్రమణకు పక్కా స్కెచ్ వేశారు. ఇందులో భాగంగా ఈ స్థలంలో నిర్మాణాలు చేపట్టడానికి చదును చేసే పనులు చేపట్టారు. విలువైన హైవే స్థలం ఆక్రమణకు గురవుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఇక్కడ రోడ్డు విస్తరణలో భాగంగా డబుల్ రోడ్డు వేశారు. అంతేగాకుండా మలుపుల వద్ద కూడా రోడ్డు చక్కగా చేశారు. దీంతో ఖాలీగా ఉన్న మలుపు స్థలాన్ని ఒకరు చదును చేసి ఆక్రమణ చర్యలు చేపట్టారు. పరిసర గ్రామాల వారు కూడా ఆదివారం జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. గ్రామస్తులు కూడా తీవ్ర నిరసన వ్యక్తం చేస్తున్నారు. అడిగేదెవరు..పనులు ఆపేదెవరంటూ విర్రవీగుతున్నట్లు చెబుతున్నారు. ఆక్రమణదారు యథేచ్ఛగాచెరువులో నుండి ట్రాక్టర్లతో మట్టి తోలి చదును చేసే పనులు చేస్తున్నారు. 20 కుంటలకు పైగా ఉన్నట్లు స్థానికులు చెబుతున్నారు. రూ. కోటి దాకా విలువ చేసే హైవే భూములు ఆక్రమణదారుల చేతికి వెళుతున్నా అధికారులు నిద్రావస్థలో ఉంటున్నారని విమర్శిస్తున్నారు. హైవే స్థల ఆక్రమణ విషయమై ఆదివారం అటు హైవే అధికారులను ఇటు స్థానిక రెవెన్యూ అధికారులను విచారించగా వెంటనే తగు చర్యలు తీసుకుంటామని తెలిపారు.

జూదరుల అరెస్టు

తంబళ్లపల్లె : మండలంలోని కోటకొండ పంచాయతీ, మండ్యంవారిపల్లి గ్రామానికి ఉత్తరం వైపున సుమారు 500 మీటర్ల దూరంలో చింతచెట్టు కింద జూదం ఆడుతున్నారనే సమాచారంతో ఆదివారం ఎస్ఐ సీఉమా మహేశ్వర రెడ్డి తన సిబ్బందితో పేకాట స్థావరంపై దాడి చేశారు. పేకాట ఆడుతున్న ఏడుగురిని అరెస్ట్ చేయగా, మరో ముగ్గురు పారిపోయారు. అరెస్ట్ చేసిన వారి వద్ద నుంచి రూ. 1,01,800ల నగదు, 5 మోటర్ బైక్లు, 10 సెల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. జూదరులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

గ్రామదేవత నల్లగంగమ్మ జాతర

తంబళ్లపల్లె: మండల కేంద్రంలోని ఈస్టుపేటలో వెలసిన గ్రామదేవత శ్రీ నల్లగంగమ్మ ఆలయంలో ఆదివారం జాతర ఘనంగా నిర్వహించారు. గ్రామస్థులు అమ్మవారికి ప్రత్యేక అలంకరణలో పూజలు నిర్వహించారు. మహిళలు నియమనిష్టలతో దీలు,బోనాలు ఊరేగింపుగా తీసుకెళ్లి అమ్మవారికి సమర్పించారు. ప్రత్యేక పూజలతో మొక్కులు తీర్చుకున్నారు.

నలసాని యల్లమ్మకు బోనాలు



కలకడ : మండలంలోని నడిమిచెర్ల గ్రామదేవత నలసాని యల్లమ్మ తల్లికి బోనాలు పట్టి, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఏడాదికి ఒక మారు చేపట్టే జాతరను శనివారం రాత్రి నుంచి ఆదివారం ఉదయం వరకు పంచాయతీలోని నడిమిచెర్ల, అగ్రహారం, వడ్డిపల్లె, కొత్తపల్లె, తదితర గ్రామాల ప్రజలు ఉదయం ఉపవాసదీక్షలతో నిర్వహించారు. పూజలు, అన్నదానం, రాత్రి చాందినీబండ్లు కట్టి ఆలయ ప్రదక్షణల అనంతరం మొక్కులు చెల్లించుకున్నారు.

సౌత్ జోన్ హాకీ టోర్నమెంట్ విజేతగా సైనిక పాఠశాల



చాంపియన్ ట్రోఫీ అందుకుంటున్న కలికిరి హాకీ టీం

కలికిరి: కర్నాటక రాష్ట్రం కొడుగు సైనిక పాఠశాలలో నిర్వహించిన సైనిక్ స్కూల్స్ ఇంట్రా గ్రూప్(సౌత్ జోన్) అండర్–17 హాకీ టోర్నమెంట్(2025–26)లో కలికిరి సైనిక పాఠశాల టీం చాంపియన్స్ ట్రోఫీని సొంతం చేసుకున్నట్లు పాఠశాల ప్రిన్సిపాల్ గ్రూప్ కెప్టెన్ సిఎస్ పరదేశి ఆదివారం తెలిపారు. అమరవతినగర్, కలికిరి కుజకూటం, కొడుగు సైనిక పాఠశాలల టీంలు పోటీలలో పాల్గొనగా కలికిరి టీం బాలికలు కొడుగు టీంను 1–0తో ఓడించి చాంపియన్‌షిప్ సాధించారన్నారు. టోర్నమెంట్‌లో బెస్ట్ ప్లేయర్ ట్రోఫీని కలికిరి విద్యార్థిని శ్రేష్ఠ కైవశం చేసుకుందన్నారు. ఈ ట్రోఫీ విజయంతో కలికిరి సైనిక్ స్కూల్ సౌత్ జోన్ తరఫున జూలై నెలలో జరుగు ఆల్ ఇండియా సైనిక్ స్కూల్స్ హాకీ టోర్నమెంట్‌లో పాల్గొననున్నట్లు ప్రిన్సిపాల్ పేర్కొన్నారు.

పీలేరు వాసులకు కళాజ్యోతి జాతీయ పురస్కారాలు



జాతీయ పురస్కారాలు అందుకుంటున్న పీలేరు వాసులు

పీలేరు : ఉమ్మడి చిత్తూరు జిల్లా కేంద్రంగా ఆదివారం నిర్వహించిన కళాజ్యోతి జాతీయ పురస్కారాల ప్రదానోత్సవంలో పలువురు పీలేరు వాసులు అవార్డులను అందుకున్నారు. ఆదివారం చిత్తూరు నాగయ్య కళాక్షేత్రంలో భారతీయ తెలుగు రచయిత సమాఖ్య , ఎంపి కేశవరెడ్డి స్మారకఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో తెలుగు తేజాలకు కళాభిషేకం, కళాకారుల సమ్మేళనం, కళాజ్యోతి పురస్కారాలు 2025 కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ప్రముఖ హాస్యనటుడు, నటకిరీటి రాజేంద్రప్రసాద్, సినీ గేయ రచయిత సుద్దాల అశోక్‌తేజ, మాజీ రాష్ట్రపతి సర్వేపల్లె రాధాక్రిష్ణన్ మనువడు సుబ్రహ్మణ్యం, చిత్తూరు ఎమ్మెల్యే జగన్‌మోహన్, ప్రముఖ రచయిత, వక్త డాక్టర్ నారాయణస్వామి, ముఖ్యఅతిథులుగా హాజరై అవార్డులు అందజేశారు. పీలేరుకు చెందిన ప్రముఖ పద్యకవి జలకనూరి మురళీధర్‌రాజు, కవిసరస్వతి శ్రీరామరాజు, కళాకారుడు ఉపాధ్యాయుడు బి.చంద్రశేఖర్, ప్రముఖ అంర్జాతీయ బహుబాషా నాటక కళాకారుడు షేక్,ఖాదర్‌బాష, విశ్రాంత డిప్యూటి తహసీల్దార్ వెంకటశేషయ్యలు జాతీయ పురస్కారాలు ఈ సందర్భంగా అందుకున్నారు.

రెడ్డెమ్మకొండపై భక్తుల రద్దీ



అమ్మవారిని దర్శించుకునేందుకు క్యూలో భక్తులు

గుర్రంకొండ: మండలంలోని చెర్లోపల్లె గ్రామంలో వెలసిన రెడ్డెమ్మతల్లి ఆలయంలో భక్తుల రద్దీ నెలకొంది. ఆదివారం రెడ్డెమ్మతల్లీ చల్లంగా చూడమ్మా అంటూ భక్తులు అమ్మవారికి పూజలు చేశారు. అమ్మవారికి వేకువజామునే నైవేద్యాలు సమర్పించి విశేష పూజలు, అభిషేకాలు నిర్వహించారు. ఆలయానికి ఉదయం నుంచే భక్తుల రాక మొదలైంది. మహిళలు కోనేట్లో స్నానమాచరించి అమ్మవారి ఎదుట వరపడ్డారు. పలువురు భక్తులు అమ్మవారికి బంగారు, వెండి, చీరెసారెలతో మొక్కులు చెల్లించుకొన్నారు. మరికొందరు భక్తిశ్రద్ధలతో తలనీలాలు సమర్పించారు. భక్తులు ఆలయంలో అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. పలువురు భక్తుల ఆలయమెట్లకు పూజలు నిర్వహించించారు.

ఎమ్మెల్యే పరామర్శ



శివప్రసాద్‌రెడ్డి కుటుంబ సభ్యులతో ఎమ్మెల్యే ద్వారకనాథరెడ్డి

తంబళ్లపల్లె: మండలంలోని గోపిదిన్నె పంచాయతీ ఉప్పులూరివాండ్లపల్లెకు చెందిన వైఎస్సార్ సీపీ నాయకులు శివప్రసాద్ రెడ్డి తల్లి చిన్నమ్మ (70) ఆదివారం మృతి చెందింది. ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథ రెడ్డి ఆ గ్రామానికి వెళ్లి వారి కుటుంబాన్ని పరామర్శించారు. అంతకు ముందు ఎమ్మెల్యే ముదివేడు గ్రామం నల్లపరెడ్డిగారిపల్లెలో వైఎస్సార్ సీపీ నాయకులు నల్లపురెడ్డి ఈశ్వర్ రెడ్డి తండ్రి నల్లపరెడ్డి రెడ్డెప్పరెడ్డి దివస కార్యక్రమంలో కూడా పాల్గొన్నారు. ఆయన వెంట మండల పార్టీ కన్వీనర్ చౌడేశ్వర్, మండల సర్పంచుల సంఘం అధ్యక్షులు సుధాకర్ రెడ్డి, నాయకులు భాస్కర్‌రెడ్డి, శివారెడ్డి, కిశోర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.